క్లుప్తంగా

క్లస్టర్ ద్వారా ధాన్యం కొనుగోలు

బొల్లాపల్లి: పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వెల్లటూరు క్లస్టర్ రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని సీఎస్‌డీటీ వై.లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెల్లటూరు మార్కెట్ గోడౌన్‌లో ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం 62మంది రైతుల వద్ద ధాన్యం నమూనాలను సేకరించామని , వీరిలో 43మంది రైతుల వద్ద నుంచి 21.87 క్వింటాల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. క్వింటా ధాన్యం ధర గ్రేడ్ -1 రకం రూ.2060లు, కామన్ రకం రూ.2040లు చెల్లిస్తున్నామని వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన పది రోజుల్లో రైతులకు నగదు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. రవాణా, గన్నీ బ్యాగ్, కూలీ ఖర్చులు ప్రత్యేకంగా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఆయన వెంట వెల్లటూరు కొనుగోలు బ్రాంచి ఇన్‌చార్జి, రైతులు తదితరులు ఉన్నారు.

కోడిపందేలు ఆడకండి

రొంపిచర్ల: మండలంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడిపందేలు, జూదాలు లాంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శుక్రవారం హెచ్చరించారు. మండల పరిధిలో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు ఉన్నాయన్నారు. కోడిపందేల జూదాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

నాదెండ్లలో ఘనంగా శివముక్కోటి

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలో కొలువైయున్న శ్రీ గంగాపార్వతి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివముక్కోటి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లను ఆలయ పూజారులు ఇర్లపాటి సాంబశివరావు, శ్రీనివాసరావు, కాశీవిశ్వనాథశర్మ, సురేష్‌లు అలంకరించి అనంతరం గోత్రనామ పూజలు నిర్వహించారు. శివముక్కోటి ఆరుద్ర నక్షత్రం కావటంతో భక్తులకు ఉత్తర ద్వారదర్శనం చేయించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంపై సాంప్రదాయబద్ధ మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి తులసీదాసు, ధర్మకర్త నల్లమోతు విజయసారధి, నల్లమోతు వీరభద్రయ్యలు పర్యవేక్షించారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష



నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, స్పందన సమస్యలపై అధికారులు సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, హౌసింగ్ ఏఈ రామకృష్ణనాయక్, ఏవో హరిప్రసాద్, ఏపీవో పుష్పరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంఈవో ఐ ఆంజనేయులు జన్మదినం సందర్భంగా బొకే అందించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

వేల్పూరు-2లో కుటుంబ వైద్యాధికారి కార్యక్రమం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు-2 గ్రామసచివాలయం పరిధిలో ఎఫ్‌పీసీ (ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం) కార్యక్రమం నిర్వహించినట్లు మండల వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా వైద్యాధికారి గ్రామీణ ప్రాంతాల్లోని పేద రోగులకు మెరుగైన వైద్యసేవలు మరింత దగ్గరకు వచ్చేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఉదయం సమయంలో గ్రామ సచివాలయాల్లో ఓపీ చూస్తామని, మధ్యాహ్న సమయంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగుల ఇళ్లకు నేరుగా వెళ్లి వారిని పరామర్శించి ఆరోగ్య సూచనలు వైద్య సేవలు అందిస్తామన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే టీకాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటరును సందర్శించి చిన్నారులకు అందించే వైద్య సేవలు రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు సూపర్‌వైజరు ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త అమరలింగేశ్వరి ఉన్నారు.

ఖోఖో జట్టులో కృష్ణవేణి విద్యార్థినులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు తృతీయ స్థానం సాధించటంతో పాటు కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు శుక్రవారం తెలిపారు. వర్సిటీ క్రీడా ప్రాంగణంలో రెండురోజుల పాటు నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థినులు ఎస్.పూజిత, ఎ.రమ్య, ఎం.శ్రావణి వర్సిటీ జట్టులో స్థానం సాధించినట్టు వివరించారు. విద్యార్థినులను కళాశాల అధ్యాపకులు ఎం.తిరుపతిరావు, సయ్యద్ మహ్మద్, షేక్.షకీలా తదితరులు అభినందించారు.

సమస్యల పరిష్కారం కోసమే..

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వార్డు ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చక్కని వేదిక అని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు గడపగడప కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అలాగే సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకొని అధికారులతో కలిసి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. 11వ వార్డులో డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షలు వెంటనే మంజూరు చేశారు. ప్రజాసమస్యల పరిష్కారమే గడపగడప ముఖ్య ఉద్దేశమన్నారు.

వినుకొండ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారు!

వినుకొండను అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వినుకొండ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారని, వినుకొండలో పేద ప్రజలు తిండికి కూడా ఇబ్బంది పడుతున్నారని, తన స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా దేశవిదేశాల నుంచి నిధులు దండుకొని వినుకొండ ప్రజల పరువును బజారున పడేస్తున్నారని దుయ్యబట్టారు. కళ్లజోళ్ల పేరుతో అంధత్వ నివారణ సంస్థ నుంచి నిధులు దండుకొని పేద ప్రజల డబ్బులు కాజేశారన్నారు. గత 10 ఏళ్లలో టీడీపీ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి మూడేళ్లలో చేసి చూపించామన్నారు.

15 కిలోమీటర్ల దూరం అభివృద్ధి

పట్టణానికి తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు, మున్సిపల్ స్టేడియం, ఎన్ఎస్పీ కెనాల్స్‌పై సీసీ రోడ్డు, మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం, కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణంతోపాటు పట్టణంలో ఎటు చూసినా 15 కిలోమీటర్ల దూరం అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఇల్లు లేని నిరుపేదలకు 5400 ఇళ్లు జగనన్న కాలనీలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులను కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం తప్ప మాజీ ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కె.నీలిమా కొండలు, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బేతం గాబ్రియేలు, 30వ వార్డు కౌన్సిలర్ షకీలా, పట్టణ పార్టీ అధ్యక్షులు పీఎస్ ఖాన్, పార్టీ నాయకులు నరాలశెట్టి శ్రీనివాసరావు, యారం రామిరెడ్డి, మాట సత్యం, కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, నంది నరసింహారావు, పులిపాటి రామారావు, మూర్తి, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో పమిడిమర్రులో అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- గడపగడపకు మనప్రభుత్వంకు అపూర్వ ఆదరణ



పమిడిమర్రులో లబ్ధిదారులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: పమిడిమర్రు గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా రూ.10 కోట్లు లబ్ధి చేకూరినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలో శుక్రవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో రూ.1.08 కోట్లతో గ్రామసచివాలయం, విలేజ్ హెల్త్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడు కార్యక్రమంలో గ్రామంలోని పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.92 లక్షలను జలజీవన్ మిషన్ పథకంలో మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే టెండర్లు ప్రక్రియ పూర్తిచేసి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పంచాయతీ నిధులు రూ.25 లక్షలతో గ్రామంలో పలు అభివృద్ధి పనులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. రూ.5 కోట్లతో పమిడిమర్రు నుంచి జేఎన్‌టీయూ కళాశాల మీదగా కర్నూలు-గుంటూరు హైవేకు ప్రత్యేక రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మహాశివరాత్రికి ఈ రోడ్డు నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. గతంలో గ్రామంలోని పేదలకు 70 మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. మరో 200మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని త్వరలోనే వారికి కూడా ఇళ్ల పట్టాలు అందజేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లపట్టాలు అందించాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇళ్ల నిర్మాణంలో కొంత జాప్యం జరిగినా అందరికీ ఇళ్లపట్టాలు అందించి గృహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ దాసరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సేతు, జెక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మూరే రవీంద్రారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ యన్నం వెంకటనర్సిరెడ్డి పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం పరిశీలన

- పంట నూర్పిడి, దిగుబడులపై అంచనా
- సాతులూరులో 20 బస్తాల దిగుబడి



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఉప సంచాలకులు పి.శ్రీనివాసరావు, మురళి

నరసరావుపేట రూరల్: మండలంలోని యల్లమందలో వరిపంటలో నిర్వహించిన పంటకోత ప్రయోగాన్ని రాష్ట్ర బృందం పరిశీలించింది. గ్రామంలోని రైతు పవన్ వరిపొలంలో శుక్రవారం పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. ప్రణాళిక శాఖ ఉప సంచాలకులు పి.శ్రీనివాసరావు, జిల్లా ప్రణాళిక అధికారి కె.ముక్తేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, వ్యవసాయ శాఖ డివిజన్ సహాయ సంచాలకులు పి.మస్తానమ్మలు పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. వరిపొలంలోని ఐదు అడుగుల పొడవు, ఐదు అడుగుల వెడల్పులో పంటను నూర్పి దిగుబడి అంచనా వేశారు. ఎకరాకు సుమారు 30 బస్తాల వరి ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీవో కార్యాలయ ఉప ప్రణాళిక అధికారి సత్యవాణి, వ్యవసాయ శాఖ గణాంక అధికారి టి.మధుసుధనరావు, మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, మండల గణాంక అధికారి పి.నాగేంద్రబాబు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు కె.బ్రహ్మయ్య, పి.గోపిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయినాథ్, హర్ష, మస్తాన్, వినయ్, షాహీర్ తదితరులు పాల్గొన్నారు.

సాతులూరులో 20 బస్తాల దిగుబడి

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు వరి పంట కోతప్రయోగం నిర్వహించారు. కార్యక్రమానికి అర్థ గణాంకశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ గణాంకాధికారి శేషుబాబు, పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, జిల్లా గణాంకాధికారి కె ముక్తేశ్వరరావు, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతుల వరి పంటలను పరిశీలించారు. అనంతరం సర్వే నెం.562/1ఏలో గల కావుగంటి ఏడుకొండలుకు చెందిన పొలంలో 25 చ.మీ విస్తీర్ణంలో వరిని కోసి దిగుబడి లెక్కించారు. ఈ దిగుబడి 9.710 కిలోలుగా నమోదైంది. ఈ ఏడాది తెగుళ్ల కారణంగా గతేడాది కన్నాకొంత దిగుబడి తగ్గినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల సహాయ గణాంకాధికారి జె.సూర్యనారాయణ, స్థానిక వ్యవసాయాధికారి హరిప్రసాద్, మధుసూధనరావు, సహాయకులు వేణుగోపాల్, రామారావు, వీఆర్వో మురళీకృష్ణ ఉన్నారు.

ఈపూరులో....

ఈపూరు: మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ పంట కోత ప్రయోగంలో పంట దిగుబడి అంచనా వేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తర్ణ అధికారి బి. అప్పారావు మాట్లాడుతూ గ్రామపరిధిలోని గంటా కోటయ్య రైతు పొలంలో బీపీటీ -5204 రకం సుమారుగా ఎకరాకు 35 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేశామని, కూచినపల్లి గ్రామ పరిధిలో కె.రామదాసు పొలంలో జేజేలు రకం ఎకరాకు 42 బస్తాల దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్ సీహెచ్. శ్రీను, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.శేషుబాబు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని చిట్టాపురం గ్రామంలో జొన్నలగడ్డ ప్రకాశరావు పొలంలో జేజీఎల్ 384 రకం ఎకరానికి సుమారు 38 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేయడం జరిగిందని మండల స్టాటిస్టికల్ ఆఫీసర కె.నాగశ్రీనివాసరావు తెలిపారు. ఆయనతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు సి.హెచ్. తిరుమల పాల్గొన్నారు.

మడమ తిప్పని నాయకుడు జగనన్న

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: నవరత్నాల్లో ఇచ్చిన హామీల ప్రకారం దఫాల వారీగా పింఛన్లు పెంచుతూ అవ్వాతాతలకు అండగా ఉన్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో మండలంలో నూతనంగా మంజూరైన నూతన పింఛన్లు, పెరిగిన పింఛన్లను ఆయన చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ఉషాకిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గతంలో మండలంలో 501 పింఛన్లు ఉండేవని, ఇప్పుడు పెరిగిన తరువాత 6300 పింఛన్లు పెరిగాయన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోపెల దేవరాజ్, జెడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, గ్రామసర్పంచ్ చెంచయ్య, శాకమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకటహనుమయ్య, సొసైటీ అధ్యక్షుడు బొల్లా బుజ్జి, గోలి వెంకటేశ్వర్లు, కాకనబోయిన శ్రీను, తహసీల్దార్ విజయ జ్యోతికుమారి, ఏపీఎం రంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మెగా క్యాన్సర్ వైద్యశిబిరానికి విశేషస్పందన

వినుకొండ(నూజెండ్ల): స్థానిక కారంపూడి రోడ్డులోని బొల్లా బ్రహ్మనాయుడు కల్యాణ మండపం వద్ద ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా క్యాన్సర్ వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. ఈ వైద్యశిబిరంలో రాజమండ్రి జీఎస్ఎల్ క్యాన్సర్ ట్రస్ట్ హాస్పటల్ డాక్టర్ గోగినేని తరుణ్ నేతృత్వంలో వైద్య బృందం పాల్గొని రూ.2 కోట్ల విలువైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మొట్టమొదటి క్యాన్సర్ నిర్ధారణ మొబైల్ వాహనం ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మానవ సేవ చేయడమే మాధవ సేవ చేయడమన్నారు. ప్రజలకు మంచి చేసే ప్రతి పనికి తమ సహకారం ఉంటుందన్నారు. ముందస్తుగా వైద్యపరీక్షలు చేయించుకోవడం వల్ల వారి పూర్తి ఆరోగ్య పరిస్థితి తెలుస్తుందన్నారు. అందుకోసమే ఉచిత మెగా క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ సంక్షేమం, వైద్యం, విద్య అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎన్నడూ లేనివిధంగా వైద్యరంగంలో విశేష అభివృద్ధి చేపడుతున్నారని, కొత్త జిల్లాల్లో ఐదు మెడికల్ కళాశాలల నిర్మాణాలను ప్రారంభించి వేగంగా పనులు చేయిస్తున్న ఘనత జగనన్నదే అన్నారు. ఆరోగ్య శ్రీ పథకంలో 3255 ప్రొసీజర్లను ప్రవేశపెట్టారన్నారు. ఇవేమి పట్టని చంద్రబాబునాయుడు, టీడీపీ నేతలు ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేయడం సమంజసం కాదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే వినుకొండ ప్రభుత్వ వైద్యశాల వైద్యసేవలు అందించడంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం హాస్పటల్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే బొల్లా అభినందించారు.

తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయలు, ఉపాధ్యాయులు

రొంపిచర్ల: విద్యార్థుల చదువు పట్ల ఇళ్ల వద్ద తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్ సాహెబ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల గృహాలను శుక్రవారం ఉపాధ్యాయులు సందర్శించారు.

గ్రామంలో పదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి వారికి పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కులను సబ్జెక్టుల వారీగా తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులుషేక్ మొహిద్దీన్ సాహెబ్ మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా చక్కగా విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఇళ్ల వద్ద విద్యార్థులకు తల్లిదండ్రులు ప్రశాంత వాతావరణం కల్పించి చదువుకునే విధంగా చేయాలన్నారు. ఈ ఏడాది పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, టి.వెంకటేశ్వర్లు, సంజయ్ కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య కోశాధికారి మృతి

యడ్లపాడు: గుండెపోటుతో మండల శ్రీ రణవీరాంజనేయ బ్రాహ్మణ సమాఖ్య కోశాధికారి యడ్లపాటి ఆంజనేయ శర్మ (73)శుక్రవారం మృతి చెందారు. బ్రాహ్మణ కుటుంబాలతో సన్నిహితంగా ఉంటూ వారి అభివృద్ధికి సమాఖ్య ద్వారా తనవంతు సహకారం అందిస్తున్న ఆయన మృతి పట్ల పలువురు సంతాపాన్ని తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. వీరి అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు ఒయాసిస్ వార్షికోత్సవం

చిలకలూరిపేటటౌన్: ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఉదయం పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, కరణం విజయలక్ష్మి చెప్పారు. శుక్రవారం కేజే ఆసుపత్రిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 16 సంవత్సాల నుంచి మహిళల ఆర్థికాభివృద్ధి, బాలికావిద్య, మహిళల ఆరోగ్య విషయాలపై సంస్థ పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మహిళల జీవనోపాధి కోసం ఇప్పటి వరకు 200 మందికి ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి,వారికి, ఉచితంగా కుట్టుమిషన్లు అందజేసినట్లు వివరించారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో సంస్థద్వారా ఇప్పటి వరకు రూ. 6 కోట్ల వరకు సహాయం అందజేసినట్లు తెలిపారు. శనివారం జరిగే వార్షికోత్సవ సభకు ముఖ్యఅతిథులుగా ఒంగోలు డీఐజీ డాక్టర్ వి.పుష్పలత, డాక్టర్ ఈ శ్రీనివాస చక్రవర్తి, పాల్గొంటారన్నారు.

12 నుంచి ముప్పాళ్లలో కబడ్డీ పోటీలు

ఈపూరు: జాతీయస్థాయి కబడ్డీ పోటీలు మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తల్లపనేని రామారావు, సూరే బ్రహ్మయ్యలు తెలిపారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే పోటీలు రైతుమిత్ర ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. ఐదు రోజుల పాటు జాతీయ స్థాయిలో జట్లు పాల్గొంటాయని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రథమ బహుమతిగా రూ.2 లక్షలు, రెండో బహుమతిగా రూ.లక్ష, మూడో బహుమతి రూ.70 వేలు, 4వ బహుమతి రూ.50 వేలు, 5వ బహుమతి రూ.40 వేలు, 6వ బహుమతి రూ.30 వేలు, 7వ బహుమతి రూ.20 వేలు, 8వ బహుమతి రూ.15 వేలు ఉంటుందని వారు తెలిపారు. రూ.50వేలు కన్సోలేషన్ బహుమతులు కూడా ఉంటాయని తెలిపారు. డే అండ్ నైట్, నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో జరుగుతాయని, ఆటల్లో పాల్గొనేవారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనదలచిన వారు పూర్తి వివరాలకై తల్లపనేని రామారావు, 8247479812ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఈపూరు: మండలంలోని ఊడిజర్ల, ముప్పాళ్ల, కొచ్చర్ల, ఈపూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రఫీ తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్‌ల్లో, 11కేవీ, 33కేవీ, ఎల్‌టీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: నరసరావుపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకూ సాతులూరు, చందవరం, గొరిజవోలు, సంకురాత్రిపాడు, నరసరావుపేట రూరల్ గ్రామాలైన దొండపాడు, పొనుగుపాడు గ్రామాలకు గృహ, వాణిజ్య, వ్యవసాయ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నరసరావుపేటలో....

నరసరావుపేట: జొన్నలగడ్డ గ్రామ సమీపంలోని 220 కేవీ విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం నరసరావుపేట పట్టణం, గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు శుక్రవారం వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

శావల్యాపురం: గ్రామసచివాలయ పరిధిలోని వలంటీర్లు తమ విధులు అంకిత భావంతో నిర్వహించి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎంపీడీవో పేరమీనా సీతారామయ్య కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో 206 మంది వలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారని, తమ క్లస్టర్ పరిధిలో నివాస గృహాల వారందరి సమగ్ర వివరాలన్నీ ప్రత్యేక రిజస్టరు ద్వారా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో సమాచారం ఇవ్వటంతో పాటు సచివాలయాలు ద్వారా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. కొన్ని గ్రామ సచివాలయాల్లోని వలంటీర్ల పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయని, విచారణలో నిర్ధారణ అయితే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. అయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులకు కూడా సంక్షేమ పథకాల గురించి సమాచారం తెలియజేయాల్సిన బాధ్యత వలంటీర్లుపై ఉందన్నారు. ఆయనతో పాటు ఈవోపీఆర్‌డి పి.సుగుణ, పరిపాలన అధికారి వాణి, కారుచోలు భారతి తదితరులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చిలకలూరిపేటటౌన్: కుటంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఎలుకల పేస్టు తిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా మార్టూరు మండలం అలగుంట జ్యోతి, యడ్లపాడుకు చెందిన హరిబాబు అనే వ్యక్తితో నాలుగు సంవత్సరాల కిందట వివాహమైంది. వీరు గత కొద్ది సంవత్సరాలుగా పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త గత రెండు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో తాపీపని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో నెల రోజుల నుంచి భర్త ప్రవర్తనలో మార్పు ఉందని భావించి, మనస్థాపం చెందిన జ్యోతి గురువారం రాత్రి ఎలుకుల పేస్టు తీసుకుంది. శుక్రవారం ఉదయం వాంతులు అవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల వేల్పూరు గ్రామంలో టీడీపీ నాయకులు బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయటాన్ని తీవ్రస్థాయిలో ఖండించారు. టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలనీ, కేవలం రాజకీయ లబ్ధికోసం అసత్య ప్రచారాలు చేయడం వలన టీడీపీ నాయకులు ఉనికి కోల్పోతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో వేల్పూరులో రూ. 12 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, ముండ్రు రాఘవరావు, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకటరావు,లింగా శ్రీనివాసరావు ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి వ్రెజలింగ్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: జిల్లాస్థాయి శాప్ లీగ్ (ఫేస్-2) వ్రెజలింగ్ అండర్-17 బాలబాలికల టోర్నమెంట్‌ను ఈనెల 8వతేదీన అచ్చంపేటలోని గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ చావలి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వివరాలకు వ్రెజలింగ్ కోచ్ కె.మనోహర్ 8309426350 ను సంప్రదించాలన్నారు.